

రేషన్ డీలర్ల నియామకానికి నోటిఫికేషన్

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ డివిజన్ పరిధిలోని 10 మండలాల్లో ఏర్పడిన 96 ఖాళీ చౌకధరల దుకాణాలకు శాశ్వత ప్రాతిపదికన డీలర్లను నియమించేందుకు బుధవారం కాకినాడ ఆర్‌డిఒ మల్లిబాబు నోటిఫికేషన్ జారీ చేశారు. డీలర్ల ఎంపిక రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఉంటుందని తెలిపారు. దరఖాస్తు నమూనా కోసం సంబంధిత తహాశీల్దారు కార్యాలయం, ఆర్‌డిఒ కార్యాలయాల పని వేళలలో పొందవచ్చన్నారు. ఆసక్తి గల వారు నోటిఫికేషన్‌లో పొందుపరచిన నిబంధనలకు లోబడి ఈ నెల 8వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు సంబంధిత తహాశీల్దారు వారి కార్యాలయం, ఆర్‌డిఒ కార్యాలయాల్లో నేరుగా గాని, రిజిస్టర్ పోస్ట్ ద్వారా గాని తమ దరఖాస్తులను సమర్పించవచ్చన్నారు. 8వ తేదీ అనంతరం వచ్చిన దరఖాస్తులను స్వీకరించరన్నారు.

ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఎప్పుడు..?

- కాకినాడలో సక్రమంగా అందని తాగునీరు
- 22 వేల పైగా కుటుంబాలకు లేని కనెక్షన్లు
- అమృత్ పథకం అమలు కోసం ఎదురు చూపులు



ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కాకినాడ స్మార్ట్ సిటీలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించడంలో నగరపాలక సంస్థ అధికారులు వెనుకబడి ఉన్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా పలు కాలనీలకు తాగునీరు సక్రమంగా అందడం లేదు. పబ్లిక్ కుళాయిల ద్వారా పూర్తిస్థాయిలో మంచినీరు అందించకపోవడంతో సామాన్య ప్రజలు ప్రైవేటు వ్యక్తుల వద్ద కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. కొన్ని ప్రాంతాలకు అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ ఇబ్బందులు తొలగడం లేదు. ఈ నేపథ్యంలో అమృత్ పథకంలో భాగంగా ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చి నిర్లక్ష్యంగా వ్యవహరించి మరిచింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ పథకం ద్వారా నగరంలో పూర్తిస్థాయిలో కొళాయి కనెక్షన్లు ఇవ్వాలని స్మార్ట్ సిటీ ప్రజలు కోరుతున్నారు.

కాకినాడ స్మార్ట్ సిటీలో దాదాపు 5.50 లక్షల జనాభా ఉంది. నగర ప్రజల అవసరాలను తీర్చేందుకు 85 ఎంఎల్‌డి సామర్థ్యం గల రెండు వాటర్ ఫూరిఫికేషన్ ప్లాంట్లు ఉన్నాయి. 26 ఓవర్ హెడ్ ట్యాంకులు ఉండగా 783 కిలోమీటర్ల మేర తాగునీటి పైపు లైన్లు విస్తరించి ఉన్నాయి. ప్రస్తుతం సుమారు 46 వేల కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. వందల్లో అనధికారిక కనెక్షన్లు ఉన్నట్లు సమాచారం.

నిలిచిన ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు

ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వాలని గత టిడిపి ప్రభుత్వమే భావించి అమలు చేయాలని చూసింది. కాకినాడ స్మార్ట్ సిటీలో ప్రతి కుటుంబానికీ తాగునీటి కుళాయి కనెక్షన్ ఇవ్వాలని 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించింది. కానీ అప్పట్లో ఆచరణకు నోచుకోలేదు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం దీనిని అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించింది. గ్రామీణ ప్రాంతాల్లో జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్లు ఇచ్చేలా పథకాన్ని తీసుకొచ్చి పలు గ్రామాల్లో అమలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో తరహాలోనే పట్టణ ప్రాంతాల్లోనూ కొళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసినా ఈలోపే ప్రభుత్వం మారడంతో ఈ పనులు నిలిచిపోయాయి.

తాగునీటికి కటకట

ప్రతి వేసవిలో శివారు ప్రాంతాలకు ప్రధానంగా గాంధీనగర్, ప్రతాప్ నగర్, రేచర్లపేట, పాతబస్టాండ్ ప్రాంతాలను తాగు నీరు వెతలు వెంటాడుతున్నాయి. పేరుకే స్మార్ట్ సిటీ అయినా అమృత్ పథకం ప్రవేశ పెట్టినా ఇప్పటికీ వాటర్ ట్యాంకర్ల ద్వారానే తాగునీరు సరఫరా చేస్తున్నారు. పురాతన పైపు లైన్లు 50 శాతం ప్రాంతాల్లో మార్చలేదు. ఇప్పటికీ లీకేజీలతోనే సరఫరా కావడం ఇక్కడి దుస్థితి. జ్యోతుల సీతారామమూర్తి హయాంలో లక్ష గ్యాలన్ల నీటి సరఫరా సామర్థ్యం ఉండగా ప్రస్తుత స్మార్ట్ కంపెనీ ఆజమాయిషీలో లక్ష గ్యాలన్ల సరఫరా పెరిగినప్పటికీ సిబ్బంది సంఖ్య పెరగలేదు. పూర్తిగా ఔట్ సోర్సింగ్ మీదే నడుస్తోంది. సురక్షిత వాటర్ వర్క్స్ ప్రాంగణం రక్షణ లేకుండా మారింది. 8 మార్గాల ప్రవేశంతో ఉన్న విక్టోరియా వాటర్ వర్క్స్ గ్రౌండ్‌కు రక్షణ లేకుండా మారింది. 4 హైలెవెల్ స్టోరేజీ ట్యాంకులు నీటి శుద్ధి సరఫరా ఉన్న ప్రాంగణం సెక్యూరిటీ లేకుండా తయారయ్యింది. ఈ నేపథ్యంలో అమృత్-2 పథకంలో భాగంగా ఇంటింటికి కుళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు అధికారులు గతంలోనే ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. 22 వేల పైనే కుటుంబాలకు ఇంటింటికీ కనెక్షన్లు అవసరమని, ఇందుకోసం సుమారు 25 కిలోమీటర్ల పొడవునా కొత్తగా పైపులైను ఏర్పాటు చేయాలని ప్రణాళికలు వేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో అమృత్ పథకం ద్వారా త్వరితగతిన ఇంటింటికి కుళాయి కనెక్షన్లు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని నగర ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా భీమా కోరేగావ్ సౌర్య దివస్

ప్రజాశక్తి-కాకినాడ

భీమా కోరేగావ్ సౌర్య దివస్‌ను బుధవారం కాకినాడలో దళిత ప్రజా సంఘాలు, కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సామాజిక న్యాయ సాధన సమితి నాయకులు డాక్టర్ మోకా పావనకుమార్ అధ్యక్షతన జరిగిన సభలో సీనియర్ దళిత నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు, సామాజిక న్యాయ సాధన సమితి నాయకులు డాక్టర్ భానుమతి, కెవిపిఎస్ సీనియర్ నాయకులు మోర్త రాజశేఖర్, కెఎస్.శ్రీనివాస్, దళిత నాయకులు పిల్లి రామారావు తదితరులు మాట్లాడారు. భారతదేశంలో క్రూరమైన కుల వివక్ష, అంటరానితనం అమలు చేసిన మహారాష్ట్రలోని పీష్వాల పాలనలో బ్రిటిష్ సైన్యం తరపున పీష్వా సైన్యానికి వ్యతిరేకంగా 500 మంది మహర్ సైన్యం 28 వేల మంది పీష్వాల సైన్యాన్ని ఓడించిన సందర్భాన్ని పురస్కరించుకుని ఏటా జనవరి 1న భీమా కోరెగోవ్ సౌర్య దివస్‌గా జరుపుకుంటామని తెలిపారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 1928 నుంచి భీమా కోరేగావ్ సందర్శించేవారని తెలిపారు.ఈ కార్యక్రమంలో దళిత నాయకులు కాశి బాలయ్య, తాడి బాబ్జి, ప్రజా సంఘాల నాయకులు జి.బేబిరాణి, పి.వీరబాబు, కె.సత్తిరాజు, మలకా రమణ కెవిపిఎస్ నాయకులు కె.సింహాచలం, కె.పద్మనాభం, నేరేడుమిల్లి రాజు, హసన్ షరీఫ్, మహ్మద్ పాల్గొన్నారు.



అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

ఈశ్వరరరావు అరెస్టుపై రాస్తారోకో

ప్రజాశక్తి-ఏలేశ్వరం

చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరీ అర్ధాంతరంగా మూసివేసి 409 మంది రోడ్డున పడ్డ కార్మికుల తరఫున 47 రోజులుగా పోరాటం చేస్తున్న సిఐటియు జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యుడు రొంగల ఈశ్వరరావు అక్రమ అరెస్టు నిరసిస్తూ ఏలేశ్వరం బాలాజీ సబ్ సెంటర్లో కార్మికులు బుధవారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషు బాబ్జి మాట్లాడుతూ జీడిపిక్కల ఫ్యాక్టరీని మూసివేయడంతో రోడ్డును పడ్డ కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని నిర్వహిస్తున్న ఆందోళనలకు రొంగల ఈశ్వరరావు నాయకత్వం వహిస్తున్నారనే అక్రమ కేసు పెట్టి మంగళవారం ఏలేశ్వరం పోలీస్ స్టేషన్లో ఉంచారన్నారు. యాజమాన్యం ప్రజాప్రతినిధులు ఒత్తిడి మేరకు కేసు నమోదు చేశారని, నాయకుడుపై కేసు పెడితే కార్మికులు ఉద్యమాన్ని నిలిపివేస్తారనే కుటిల ప్రయత్నాలు సాగవన్నారు. అక్రమ కేసులకు భయపడేది లేదని ఆయన హెచ్చరించారు. ఉపాధి కోల్పోయిన కార్మికులకు వెంటనే ఉపాధి కల్పించాలని, అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 2న జిల్లావ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. అప్పటికి సమస్య పరిష్కారం కాకపోతే ఈ నెల 5న చలో కలెక్టరేట్ నిర్వహిస్తామన్నారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరుకుని నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, వర్కింగ్ కమిటీ సభ్యుడు రొంగల ఈశ్వరరావు, సిపిఎం మండల కార్యదర్శి పాకలపాటి సోమరాజు, సిఐటియు నాయకులు పిల్ల రాంబాబు, ఎస్‌కె.పద్మ, నెక్కెళ్ల శ్రీను, కొల్లి సతీష్ కుమార్, నిట్ల శ్రీను, జీడి పిక్కల ఫ్యాక్టరీ కార్మిక నాయకులు ఎ.వీరబాబు, చక్రధర్, గోవింద్, ధర్మాజీ, లోవరాజు, అన్నపూర్ణ, భాగ్యలక్ష్మి, జయలక్ష్మి, వరలక్ష్మి, సత్య, చంటి కార్మికులు ఉన్నారు.



రాస్తారోకో చేస్తున్న సిఐటియు నాయకులు, ప్రజలు

4, 5 తేదీల్లో అంతర్జాతీయ నీటి పక్షుల గణన

ప్రజాశక్తి - తాళ్లరేవు

అంతర్జాతీయ నీటి పక్షులను గుర్తించి లెక్కపెట్టడంలో భాగంగా రెండు రోజుల పాటు కాకినాడ జిల్లా కోరంగి అభయారణ్యం, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిసర ప్రాంతాల్లో ఈ నెల 4, 5 తేదీల్లో నీటి పక్షుల గణన చేపట్టనున్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో జరగనున్న ఈ పక్షుల గణనకు సంబంధించి బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ (బిఎన్‌హెచ్ఎస్) బర్డ్స్ వాచర్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, డెక్కన్ బర్డ్స్ హైదరాబాద్, ఎడబ్ల్యుసిఎస్, డబ్ల్యుఐ వంటి సంస్థలతో పాటు కళాశాల విద్యార్థులు, మొత్తం 60 మంది బృందం ఈ పక్షుల గణన చేపట్టనున్నారు. దీనిలో భాగంగా 4వ తేదీన కోరంగిలో ఈ బృంద సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహిస్తారు. రెండో రోజు కోరంగి అభయారణ్యం పరిసర ప్రాంతాల్లోని 12 పక్షి ఆవాస ప్రాంతాల్లో బృందానికి ఐదుగురు చొప్పున ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నీటిపక్షుల గణన చేపడతారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా అటవీశాఖ అధికారి రవీంద్రనాథ్ రెడ్డి, ఫారెస్ట్ రేంజర్ ఎస్-ఎస్‌ఆర్.వరప్రసాద్, రీసెర్చ్ సైంటిస్ట్ మహేష్ తదితరులు పర్యవేక్షిస్తారు. గతేడాది నిర్వహించిన పక్షుల గణనలో భాగంగా 41,131 రకాల అంతర్జాతీయ పక్షులను ఈ ఆవాస ప్రాంతాల్లో గుర్తించారు. వీటిలో 108 జాతులు ఉన్నట్లు రీసెర్చ్ సైంటిస్ట్ మహేష్ తెలిపారు.



కోరంగి అభయారణ్యంలోని వలస పక్షులు

రొంగల ఈశ్వరరావు అరెస్టును ఖండించాలి

ప్రజాశక్తి-కాకినాడ

సిఐటియు జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యుడు రొంగల ఈశ్వరరావుపై తప్పుడు కేసులు బనాయించి అరెస్టు చేయడాన్ని సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దువ్వా శేషబాబ్జి, చెక్కల రాజకుమార్ బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఏలేశ్వరం మండలం చిన్నింపేటలో అక్రమంగా మూసివేసిన ఇంటర్ స్నాక్ క్యాషూ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీని తెరిపించాలని కోరుతూ 45 రోజుల నుండి కార్మికులు చేస్తున్న శాంతియుత ఆందోళనకు ఈశ్వరరావు నాయకత్వం వహిస్తున్నారు. జర్మనీ దేశానికి చెందిన మల్టీ నేషనల్ కంపెనీ ఇంటర్ స్నాక్ క్యాషూ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను మూసివేస్తున్నట్లు 2024 అక్టోబర్ 29న యాజమాన్యం నోటీసు అందించిన నాటినుండి కార్మికులు ఉపాధి భద్రత కోరుతూ ఆందోళన బాట పట్టారు. ఆందోళనను విచ్ఛిన్నం చేయాలని యాజమాన్యం, అధికార పార్టీ నాయకులు కుమ్మక్కయి ఈశ్వరరావుపై అక్రమ కేసులు బనాయించారని విమర్శించారు. అక్రమ కేసులు పెట్టి వేధించడం వెనుక ప్రత్తిపాడు ఎంఎల్ఎ పాత్రపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్మికులందరూ టిడిపి కార్యకర్తలని కూడా చూడకుండా యాజమాన్యంతో కుమ్మక్కై అన్యాయం చేయడానికి యాజమాన్యం ఇచ్చిన ముడుపులే కారణమని ఆరోపించారు. తక్షణం బేషరతుగా రొంగల ఈశ్వరరావును విడుదల చేసి అక్రమ కేసులు ఎత్తివేయాలని, అనుమతులు లేకుండా మూసివేసిన పరిశ్రమను తెరిపించి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు..!

నూతన సంవత్సర వేడుకలను బుధవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. పలువురు ఎంఎల్ఎలు, ప్రముఖులకు నాయకులు, ప్రజలు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ నూతన సంవత్సరంలో కాకినాడ జిల్లా అందరి భాగస్వామ్యంతో అన్ని రంగాల్లో పురోభివృద్ధి సాధించాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి ఆకాంక్షించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కాకినాడ రంగరాయ వైద్య కళాశాల వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన ఆనంద నిలయం వసతి గృహం విద్యార్థుల నడుమ కలెక్టర్ షాన్ మోహన్, సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జి జెడి జి.శ్రీనివాసరావు ఇతర అధికారులతో కలిసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. వినూత్న రీతిలో ఆనంద నిలయం విద్యార్థులకు నోటు పుస్తకాలు, పండ్లు ఇతర వస్తువులు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులకు ఉపయోగపడే నోట్ పుస్తకాలు, టవల్స్ ఇతర కాస్మటిక్స్ వస్తువులు, పుష్పగుచ్ఛాలు ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, కాకినాడ కమిషనర్ భావన, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, డిఆరఒ జె.వెంకటరావు, కాకినాడ, పెద్దాపురం ఆర్‌డిఒలు, కలెక్టరేట్ ఎఒ, కలెక్టరేట్ సిబ్బంది, జిల్లాకు చెందిన పలు ఉద్యోగ సంఘాల నాయకులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సామర్లకోట ప్రముఖులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు అధిక సంఖ్యలో ప్రజలు తరలి రావడంతో వారి నివాసాల వద్ద సందడి నెలకొంది. పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్పకు చెందిన అచ్చంపేటలోని నివాసంలోనూ, పెద్దాపురం మండలం పులిమేరులో కుడా చైర్మన్, జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల రామస్వామి నివాసం వద్ద, వైసిపి పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబు నివాసం వద్ద శుభాకాంక్షలు తెలియజేసేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

తాళ్లరేవు ఎంపిపి రాయుడు సునీత, గంగాధర్ దంపతులకు పలువురు ఎంపిటిలు, సర్పంచులు, అధికారులు, ప్రజాసంఘాల నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, అత్తిలి బాబూరావు, ఎంపిడిఒ సత్యనారాయణ, గాడిమొగ పిహెచ్‌సి వైద్యులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, యానిమేటర్లు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

రౌతులపూడి ఎంపిపి గంటిమల్ల రాజ్యలక్ష్మికి మండలంలోని పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు అధికారులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పైల సాంబశివరావు, టిడిపి మండలాధ్యక్షులు, సర్పంచ్ తమరాల సత్యనారాయణకు, జెడ్‌పిటిసి గొల్లు లక్ష్మణమూర్తికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

జగ్గంపేట జగ్గంపేట మండలం ఇర్రిపాకలో ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ స్వగృహం వద్ద నెహ్రూకు శుభాకాంక్షలు తెలిపేందుకు అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వచ్చారు. ప్రత్తిపాడు ఎంఎల్ఎ వరుపుల సత్య ప్రభ నెహ్రూ కు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబుకు వైసిపి కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. గుర్రపాలెంలోని స్వామి వివేకానంద విద్యా సంస్థల ఆవరణలో జెడ్‌పిటిసి ఒమ్మి బిందు మాధవి, వైసిపి నాయకులు ఒమ్మి రఘురామ్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. కిర్లంపూడి మండలం రామచంద్రపురంలో జనసేన జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ స్వగృహం వద్ద విందు ఏర్పాటు చేశారు. నవీన్ పాల్గొన్నారు.

ప్రత్తిపాడు ఎంఎల్ఎ వరుపుల సత్య ప్రభ తన నివాసంలో నాయకులు, కార్యకర్తల మధ్య కేకు కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొమ్ముల కన్నబాబు, వెన్న శివ, యాళ్ల జగదీష్, చక్కపల్లి మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, వైసిపి ప్రత్తిపాడు నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు నివాసంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలువురు వారికి శుభాకాంక్షలు తెలిపారు. వైసిపి నేత ఎంఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకష్ణంరాజు నివాసంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. పలు గ్రామాల నాయకులు అభిమానులు ధర్మవరంలో మురళీకష్ణంరాజు నివాసములో మురళి కృష్ణంరాజును కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

గండేపల్లి న్యూ ఇయర్ వేడుకలను ప్రజాప్రతినిధులు అధికారులు ఘనంగా నిర్వహించారు మురారిలో యువ నాయకుడు జాస్తి వసంత్ ఇంటి వద్ద సింగరంపాలెంలో కోర్టు లచ్చయ్య దొర ఇంటి వద్ద మండల పార్టీ అధ్యక్షులు పోతుల మోహన్‌రావు, జెడ్.రాగంపేట కందుల చిట్టిబాబు. ఎంపిపి చలగల దొరబాబు గృహాల వద్ద కార్యకర్తలతో అభిమానులతో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ అధికారులు వారి వారి కార్యాలయం వద్ద నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకున్నారు. అల్పాహారం ఏర్పాటు చేసి స్వీట్లు పంపిణీ చేశారు.


కాకినాడ రూరల్ గొడారిగుంటలోని కాకినాడ రూరల్ ఎంఎల్ఎ పంతం నానాజీ స్వగహం వద్ద శుభాకాంక్షలు తెలిపేందుకు జిల్లా నలుమూలల నుంచి కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. ఎంఎల్ఎ నానాజీని ఘనంగా సత్కరించారు.



కాకినాడలో విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న కలెక్టర్



సామర్లకోటలో ఎంఎల్ఎ చినరాజప్పకు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు




కాకినాడ రూరల్‌లో ఎంఎల్ఎ నానాజీకి శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు



గండేపల్లిలో న్యూ ఇయర్ వేడుకల్లో పాల్గొన్న నాయకులు


కార్టూ'నిజం'



కుడుపూడి సూర్యనారాయణకు ఘన నివాళి

ప్రజాశక్తి-కాకినాడ

కుడుపూడి సూర్యనారాయణ 22 వ వర్ధంతి సందర్భంగా బుధవారం సుందరయ్య భవన్‌లో ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు, దళితోద్యమ సీనియర్ నేత అయితాబత్తుల రామేశ్వరరావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు జి.బేబిరాణి, నగర కమిటీ సభ్యులు కె.సత్తిరాజు సూర్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగిగా సూర్యనారాయణ పని చేసిన ప్రతిచోటా అభ్యుదయ భావాల వ్యాప్తికి కృషి చేశారని తెలిపారు. సిపిఎం ఇంద్రపాలెం గ్రామ శాఖ కార్యదర్శిగా, కాకినాడ పట్టణ కమిటీ సభ్యునిగా ఎనలేని సేవలు చేసారని కొనియాడారు. ప్రజాశక్తి దినపత్రిక సర్క్యులేషన్‌లో, ప్రజాశక్తి అభ్యుదయ సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళడంలో తనదైన శైలిలో కృషి చేసారని తెలిపారు. గొప్ప మానవతావాదిగా సూర్యనారాయణ ఆచరణ నేటితరం వారు పాటించాలని సూచించారు. ఏడు పదుల వయసులో కూడా అత్యంత క్రమశిక్షణతో వివిధ ప్రజా ఉద్యమాలలో సూర్యనారాయణ పాల్గొన్నారని తెలిపారు. ఎర్రజెండాకే వన్నె తెచ్చిన సూర్యనారాయణ స్ఫూర్తితో కాకినాడ నగరంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర పలివెల వీరబాబు, జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్.రాజ్‌కుమార్, సిహెచ్.రమణి, నగర కమిటీ సభ్యులు మలకా వెంకట రమణ, నాగాబత్తుల సూర్యనారాయణ, కె.వీరబాబు, కె.సత్తిబాబు, పాలిక రాజేంద్ర ప్రసాద్, చంద్రావతి, వీరవేణి, బేబి పాల్గొన్నారు.



పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు



గుడ్డ సంచులను పంపిణీ చేస్తున్న డాక్టర్ విజయబాబు

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

పర్యావరణానికి పెను ముప్పుగా మారిన ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేద్దామని పర్యావరణ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ సఖిరెడ్డి విజయబాబు పిలుపునిచ్చారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఆయన బుధవారం గుడ్డ సంచులను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ గుడ్డ సంచులను వాడతామని సంఘ సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ అనసూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రపంచవ్యాప్తంగా ఉద్యమంగా చేపట్టాలని పిలుపునిచ్చారు. గోళ్ల నాగేశ్వరరావు, జ్యోతుల నాగ సత్య శ్రీనివాస్, కరోతు సత్యనారాయణ, వేల్పుల సూరిబాబు, రౌతు సహదేవుడు, నారాయణరావు, తిరగటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సూరిబాబు రాజు

సాహితీ స్రవంతి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పెద్దాపురం

సాహితీ స్రవంతి ప్రచురించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెద్దాపురం పట్టణ పరిధిలో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాహిత్య కార్యక్రమాల కృషిని ఆయన అభినందించారు. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జోస్యుల కృష్ణ బాబు, పెద్దాపురం సాహితీ స్రవంతి కార్యదర్శి కొత్త శివ, పూడి శ్రీనివాస్, క్రాంతి కుమార్ పాల్గొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు తమ స్వగహంలో, ఎంఇఒ కార్యాలయంలో ఎంఇఒలు ఈరంకి ప్రభాకర్ శర్మ, వి రామకష్ణ చౌదరి లు సాహితీ స్రవంతి క్యాలెండర్‌ను ఆవిష్కరించారని సాహితీ స్రవంతి కార్యదర్శి కొత్త శివ తెలిపారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి మండలం యర్నగూడెం సెంటర్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. ట్రాక్టర్ బైకుపై వెళ్తున్న వారిని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. రాజమహేంద్రవరం నుంచి అనంతపల్లికి చిన్నారితో కలిసి ముగ్గురు బైకుపై వెళ్తున్న వ్యక్తిని ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో మోటార్ సైకిల్‌పై ఉన్న వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకొన్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 లో గోపాలపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట శివారు ప్రత్తిపాడు వెళ్లే సిబిఎం జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదంలో బుధవారం మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. బైక్‌ను లారీ ఢీకొట్టిన ఈ సంఘటనలో పెద్దాపురం మండలం కట్టమూరు గ్రామానికి చెందిన కంచు వరాలమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. లారీ బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టి, మహిళా కాళ్ల పైనుంచి ఎక్కడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. గాయపడిన వరాలమ్మను చికిత్స నిమిత్తం సామర్లకోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎపిఎన్‌జిఒ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తాళ్లపూడి

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు ఈ నూతన సంవత్సరంలో నెరవేరాలని ఎపిఎన్‌జిఒ జిల్లా శాఖ జాయింట్ డైరెక్టర్ అప్పలకొండ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. యూనియన్ ముద్రించిన గోపాలపురం తాలూకా క్యాలెండర్‌ను ఆయన బుధవారం ఆవిష్కరించారు. జెఎసి చైర్మన్ జోడాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జోడాల మాట్లాడారు. ఉద్యోగుల సమస్యల పట్ల ఎపి ఎన్‌జిఒ చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప గణాంక అధికారులు సోమరాజు, సూర్యనారాయణ, శ్యాం ప్రసాద్, జయ భారతి, సహాయ గణాంక అధికారులు శ్రీలక్ష్మి, నీలిమ, నాయుడు, రెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



దుస్తులు అందజేస్తున్న సర్పంచ్ సత్యనారాయణ

40 మందికి దుస్తుల అందజేత

ప్రజాశక్తి - నల్లజర్ల

నల్లజెర్ల మండలం ఆవపాడు గ్రామ పంచాయతీలో నూతన సంవత్సరం సందర్భంగా సచివాలయం, పంచాయతీ, సిబ్బంది వార్డు సభ్యులు మొత్తంగా 40 మందికి దుస్తులను జనసేన జిల్లా కార్యదర్శి, సర్పంచ్ అచ్యుత సత్యనారాయణ బుధవారం ఆయన ఇంటివద్ద అందజేశారు. ఈ కార్యాక్రమంలో సిబ్బంది, సర్పంచ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



సభ్యత్వం తీసుకున్న ప్రసాద్‌తో టిడిపి నాయకులు

టిడిపి శాశ్వత సభ్యత్వం తీసుకున్న పారిశ్రామికవేత్త ప్రసాద్

ప్రజాశక్తి - తాళ్లపూడి

తాళ్లపూడి మండలం అన్నదేవరపేట గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త జివి.ప్రసాద్ రూ.లక్ష కట్టి టిడిపిలో శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు. నియోకవర్గంలో శాశ్వత సభ్యత్వం తీసుకున్న మొదటి వ్యక్తిగా ఆయన నిలిచారని యువ నాయకుడు అల్లూరి విక్రమాదిత్య తెలిపారు. ఈ సందర్భంగా జివిపికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ గళం నాయకులు కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణపతి తదితరులు ఉన్నారు.



డైరెక్టర్ జాన్‌పీటర్‌ను సత్కరిస్తున్న సిబ్బంది

వృద్ధులకు పండ్లు, దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి -దేవరపల్లి

నూతన సంవత్సరం సందర్భంగా గౌరీపట్నం నిర్మలగిరి పుణ్యక్షేత్రంలో డైరెక్టర్ జాన్ పీటర్, అన్నదానం ట్రస్ట్ మేనేజర్ కె.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్మల హృదయ స్కూలు, కళాశాల సిస్టర్స్ సన్మానించారు. వృద్ధాశ్రమంలోని వృద్ధులు, పేదలు 200 మందికి స్వీట్లు, పండ్లు, దుప్పట్లు, దుస్తులు అందించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ గిరీష్, ఫాదర్ ఏసు బాబు, బట్టు శివ, శ్యాం సుందర్, కొమ్మర అనిల్ పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ

ప్రజాశక్తి - నల్లజర్ల

మండలంలోని అచన్నపాలెం గ్రామంలో బుధవారం రాత్రి స్థానిక బేతేలు ప్రార్థనా మందిరం, ఎలోహిం, కవనెంట్ ఫెలోషిప్, మినిస్ట్రీస్, షాలెం ఫైర్ హౌస్ మినిస్ట్రీస్ తదితర చర్చిల్లో సుమారు 500 మందికి టిడిపి నాయకుడు పాతూరి రమేష్ ఆధ్వర్యంలో స్వీట్లు పంచారు. ఈ కారక్రమంలో నాయకులు పాతూరి ఆదినారాయణ, కె.సత్యనారాయణ, పి.మోహన్, కె.రాంబాబు, యు.సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

మత విద్వేషాలు రగిలించొద్దు : సిపిఎం

ప్రజాశక్తి - నిడదవోలు

ప్రజల మధ్య మత విద్వేషాలు రగిలించొద్దని, నూతన సంవత్సరంలో ప్రభుత్వం నూతన బారాలను మోపద్దు అంటూ సిపిఎం నాయకులు ప్రజలందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ కరపత్ర ప్రచారం చేశారు. నిడదవోలు పట్టణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, నిడదవోలు పట్టణ కార్యదర్శి జె.రాంబాబు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పులను సాకులుగా చూపి టోల్ ట్యాక్స్, సర్ ఛార్జీలు, పన్నులు పెంపు తదితర రూపాల్లో భారాలు మొపెందుకు సిద్ధం అవుతుందన్నారు.. వీటిపై ప్రజలు ఐక్యమై ప్రతిఘటన, ఉద్యమాలు చేయకుండా మతాన్ని ఆయుధంగా వాడుకుంటున్నారన్నారు. లౌకిక విధానం అమలు చేయాల్సిన పాలకులు ప్రజలు మధ్య విద్వేషాలు సృష్టిస్తూ రెచ్చగొట్టే ఉపన్యాసాలు, వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. నాగరిక సమాజాన్ని ముందుకు తీసుకెళ్లే రాజ్యాంగాన్ని పక్కనబెట్టి మెజారిటీ ప్రజలకు, మొత్తం స్త్రీ జాతిని బానిసలుగా చేసే మనుధర్మాన్ని తీసుకుని రావాలని చూడటం ప్రమాదకరమన్నారు. ఉప ముఖ్య మంత్రి హోదాలో ఉండి పవన్ కళ్యాణ్ ఈ మేరకు ప్రకటనలు చేయడం అత్యంత ప్రమాదమన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి, ప్రజాస్వామ్యానికి భిన్నమైనది అని తెపారు. నూతన సంవత్సరంలో ప్రజల సంపదను అంబానీ, అదానీలకు కట్టబెట్టే విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం జరిపే పోరాటాల్లో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.పవన్, నిడదవోలు మండల కమిటీ సభ్యులు గంటి కృష్ణ, డానియేలు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంచుతున్న సిపిఎం నాయకులు

అందరి ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రజలందరి సంపూర్ణ ఆరోగ్యమే తమ కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. అందరూ ఆరోగ్యంగా ఉంటేనే మానవ వనరులు సద్వినియోగం అయ్యి సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. తిలక్ రోడ్డులోని తన కార్యాలయం వద్ద ముగ్గురికి రూ.2.40 లక్షల సిఎం సహాయ నిధి చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ఇంతటి మంచి కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. తమ ప్రభుత్వం వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాష్ట్ర ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి సంకల్పమన్నారు. అందుకే ఎన్‌టిఆర్ వైద్య సేవల ద్వారా పేదలకు ఉచిత వైద్యం అందిస్తున్నారని తెలిపారు. ఎన్‌టిఆర్ వైద్య సేవలు వర్తించని పేదలకు సిఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందజేస్తున్నామని చెప్పారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో రాజమహేంద్రవరంలో సిఎం సహాయ నిధి నుంచి ఒక్కచెక్కు కూడా ఇవ్వలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఆరు నెలల్లో ఇంతవరకు రాజమహేంద్రవరం సిటీ నియోజకర్గానికి సంబంధించి సుమారు రూ.70 లక్షలు సిఎం సహాయ నిధి నుంచి తాను తీసుకువచ్చి అందించానిని తెలిపారు. మరో రూ.80 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వాటిని కూడా త్వరలో అందచేస్తామని భరోసా ఇచ్చారు. పేదలకు మెరుగైన వైద్యం అందించడానికి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు.



చెక్కులు అందిస్తున్న ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్

మత్స్యకారుల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-కాకినాడ

వాడబలిజ మత్స్యకారుల అభివద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎంఎల్‌ఎ కర్రి పద్మశ్రీ తెలిపారు. బుధవారం నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని కాకినాడ సిటీ వాడబలిజ మత్స్యకార అసోసియేషన్ ప్రతినిధులు ఎంఎల్‌సి పద్మశ్రీని మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి పద్మశ్రీ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకుని ముందుకు సాగడం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని హితవు పలికారు. వాడబలిజ మత్స్యకారుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కొత్త సంవత్సరం అందరికీ మేలు, మంచి చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వాడబలిజ మత్స్యకార అసోసియేషన్ ప్రెసిడెంట్ నీలపల్లి కామరాజు మాట్లాడుతూ తమ సంఘం ఆవిర్భావానికి సంపూర్ణ సహకారం అందించిన పద్మశ్రీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ చుక్కా నూకరాజు, సెక్రటరీ గరికిన సతీష్ బాబు, ట్రెజరర్ పిరిది మంగరాజు, పెద్దలు బడేగోవింద్, పేర్ల రజిని తదితరులు ఉన్నారు.



ఎంఎల్‌సి పద్మశ్రీతో సంఘం నాయకులు

అభ్యంతరాల స్వీకరణ పొడిగింపు

ప్రజాశక్తి-కాకినాడ

షెడ్యూల్ కులాల జాబితా సోషల్ ఆడిట్ కార్యక్రమంలో భాగంగా ప్రతి సచివాలయ పరిధిలోని షెడ్యూల్ కులాలకు చెందిన వ్యక్తుల జాబితా సంబంధిత గ్రామ వార్డు సచివాలయల యందు ప్రచురించడం జరిగిందని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి తెలిపారు. దీనిపై అభ్యంతరాల స్వీకరణకు మొదటిగా డిసెంబర్ 31, 2024 తేదీ వరకు సమయం ఇచ్చారని తెలిపారు. ఆ తేదీ ముగియడంతో ప్రస్తుతం అభ్యంతరాల స్వీకరణకు ఈ నెల 7వ తేదీ వరకు ప్రభుత్వం సమయాన్ని పొడిగించింది, ప్రజలందరూ సదరు విషయమై తమ అభ్యంతరాలను ఈ నెల 7వ తేదీ లాగా దాఖలు చేయాలని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.



బీచ్‌రోడ్డుకు వెళ్లకుండా బారికేడ్లు పెట్టి మూసివేసిన పోలీసులు

ఉప్పాడ బీచ్ రోడ్డు మూసివేత

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఉప్పాడ కాకినాడ బీచ్ రోడ్డును పర్యాటకుల తాకిడి అధికంగా ఉండడంతో బుధవారం సాయంత్రం మూసి వేశారు. ఉప్పాడ నుంచి కాకినాడ వెళ్లే వాహనాలను వయా పిఠాపురం మీదగా దారి మళ్ళించారు. నేమాం జంక్షన్ వద్ద రోడ్డును మూసివేసి ఉప్పాడ వెళ్లే వాహనాలను నామం పండు మీదుగా వాహనాలు మళ్ళించారు. ట్రాఫిక్‌ను యు.కొత్తపల్లి ఎస్ఐ వెంకటేష్ దగ్గరుండి క్లియర్ చేశారు. నూతన సంవత్సరం కావడంతో వాహనాలు, పర్యాటకుల తాకిడి అధికంగా ఉందని, దీంతో తాత్కాలికంగా ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు బీచ్ రోడ్‌ను మూసివేసామని తెలిపారు.

ఎస్‌సి సర్వేపై 41 అభ్యంతరాల దరఖాస్తులు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలో నిర్వహించిన ఎస్‌సి కుల సర్వేపై ప్రజల నుండి 41 అభ్యంతరాల దరఖాస్తులు అందాయని తహశీల్దారు సిహెచ్.వెంకటలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ అభ్యంతరాలు తెలిపేందుకు గడువును ఈ నెల 7వ తేదీ వరకు పొడిగించామని, అభ్యంతరాల గడువు ముగిసిన అనంతరం 11వ తేదీ వరకు వచ్చిన అభ్యంతరాలను పరిశీలిస్తారన్నారు. 17వ తేదీన తుది జాబితాను ఆయా గ్రామ, వార్డుల సచివాలయాల వారీగా ఏర్పాటు చేస్తామన్నారు.

రేషన్ డీలర్స్ భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం డివిజన్ పరిధిలో ఖాళీలు ఏర్పడిన 50 చౌక ధరల దుకాణాల శాశ్వత ప్రాతిపదికన డీలర్ల నియామకానికి ఈ నెల 8వ తేదీ సాయంత్రం 5 గంటలోగా దరఖాస్తు చేసుకోవచ్చని ఆర్‌డిఒ శ్రీరమణి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ పెద్దాపురం డివిజన్ పరిధిలో 50 రేషన్ షాపుల డీలర్ల నియామకానికి రాత పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేస్తామన్నారు. దరఖాస్తు నమూనాల కోసం సంబంధిత తహశీల్దార్ల కార్యాలయాల్లో, పెద్దాపురం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో పని వేళల్లో పొందవచ్చన్నారు. తమ దరఖాస్తులను నేరుగా, లేదా రిజిస్టర్ పోస్టు ద్వారా ఈ నెల 8వ తేదీ లోగా సమర్పించవచ్చన్నారు.

సత్యదేవుని దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి-శంఖవరం

అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకుకున్నారు. విలువల కమిటీ చైర్మన్ చాగంటి కోటేశ్వరరావు, టిటిడి ట్రస్ట్ బోర్డు సభ్యుడు, జగ్గంపేట ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ, ఎంఎల్‌సి బొత్స సత్యనారాయణ కుటుంబ సమేతంగా వచ్చారు. వీరందరికీ దేవస్థానం ఇఒ వీర్ల సుబ్బారావు ఆధ్వర్యంలో అధికారులు ఆలయ లాంఛనాలతో స్వాగతించారు. అనంతరం స్వామివారి జ్ఞాపక, ప్రసాదం అందజేశారు.

మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా భాస్కర శాస్త్రి

ప్రజాశక్తి - అమలాపురం

పట్టణంలో భూపయ్య అగ్రహారానికి చెందిన న్యాయవాది వెంపరాల భాస్కర శాస్త్రి అమలాపురం మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా నియమితులయ్యారు. భాస్కర శాస్త్రిని నియమిస్తూ రాష్ట్ర మున్సిపల్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు బుధవారం అమలాపురం కమిషనర్ కె.రాజు తెలిపారు. భాస్కర్ శాస్త్రి నియమకంపై పట్టణానికి చెందిన న్యాయవాదులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.




మ్యాగజైన్ ఆవిష్కరిస్తున్న ఆర్‌డిఒ అఖిల

మోడరన్ విద్యాసంస్థల మ్యాగజైన్ ఆవిష్కరణ

పజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలోని మోడరన్ విద్యాసంస్థల మ్యాగజైన్ ఆర్‌డిఒ డి.అఖిల బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ విద్యార్థుల సృజనాత్మకను ప్రోత్సాహించేలా మ్యాగజైన్‌ని రూపొందించడం మంచి ప్రయత్నం అన్నారు. మోడరన్ కాలేజీ అందజేస్తున్న స్కాలర్ షిప్‌లను, ఉచిత సీట్లపై మోడరన్ అధినేత డాక్టర్ లయన్ జివి.రావును ఆర్‌డిఒ అభినందించారు. అనంతరం జివి.రావు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం మ్యాగజైన్ విడుదల చేయడం సంతోషదాయకం అని అన్నారు. అనంతరం కాకినాడ వేగా జ్యువెలర్స్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు . ఈ కార్యక్రమంలో డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పి.వేంకటేశ్వర్లు, ఇంటర్ కాలేజీ ప్రిన్సిపల్ సిహెచ్.రాజేష్, అకాడమిక్ డైరెక్టర్ కె.సాయిరాం చౌద రితో హైస్కూల్ హెడ్ మాస్టర్ ఎం.చిట్టి బాబు, వైస్ ప్రిన్సిపల్ పి.ఎస్.ప్రకాష్, అకడమిక్ అడ్వైజర్ సి. హెచ్ శ్రీనివాస్, మోడరన్ స్టాఫ్ పాల్గొన్నారు.



నగరంలో న్యూ ఇయర్ వేళ వివిధ పదవులు పొందిన వారికి సన్మానం

నీటి సంఘాల కార్యవర్గానికి సన్మానం

ప్రజాశక్తి - మామిడికుదురు

మండల పరిధిలో నీటి సంఘాల కార్యవర్గాన్ని బుధవారం ఘనంగా సన్మానించారు. సర్పంచ్ జాలెం రమణకుమారి ఆధ్వర్యంలో నియోజక వర్గం ఎస్‌సి సెల్ ఉపాధ్య క్షులు సర్పంచ్ సోద రుడు జాలెం సుబ్బారావు ఇంటి వద్ద నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా మానేపల్లి నీటి సంఘం అధ్యక్షులు మద్దాల తమ్మయ్య, వైస్ ఛైర్మన్ గిడుగు రారాజు, 10 మంది టిసి సభ్యులను, తాటిపాక ఛానల్ నీటి సంఘం అధ్యక్షులు కడలి కష్ణమోహన్, ఉపాధ్యక్షులు కన్నన్ కుమార్. 10 మంది నీటి సంఘ టిసిలను సన్మానించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ఉర్దూ అకాడమీ స్టేట్ బెస్ట్ టీచర్స్ నబియల్ హాసన్, ముజ్ తబ హుస్సేన్, ఖనీజే అష్మ, రాష్ట్ర వక్ఫ్ బోర్డు మెంబర్ హాజీ ముఖరం హుస్సేన్‌లకు ఘనంగా సన్మానం చేశారు . ఈ కార్యక్రమంలో జనసేన అధ్యక్షులు జాలెం శ్రీనివాసరాజా, హైస్కూల్ ఎస్ఎంసి ఛైర్మన్ జాలెం ఉమాపార్వతి, వానరాశి ప్రసాద, సాధక్ హుస్సేన్, కోళ్ల సురేష్ బాబు పాల్గొన్నారు .

సచివాలయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

అసంపూర్తిగా ఉన్న సచివాలయం నిర్మాణం పూర్తి కావడంతో బుధవారం సచివాలయాన్ని ఎంపిడిఒ ప్రారంభించారు. ఆత్రేయపురం సచివాలయం పనులు పూర్తవకుండానే ఎన్నికలకు ముందు అప్పటి ఎంఎల్‌ఎ ప్రారంభించారు. దీంతో కొద్దిపాటి పనులు మిగిలి పోవడంతో సచివా లయం నిరుప యోగంగా ఉండడంతో ఈ విషయాన్ని స్థానిక ఎంఎల్‌ఎ బం డారు సత్యానందరావు దృష్టికి తీస ుకెళ్లగా ఆయన చొరవతో సచివాల యాన్ని పూర్తి చేయించారు. బుధవారం నూతన సంవత్సరము సందర్భంగా శిథిలావస్థకు చేరిన హాస్టల్ భవనంలో ఉంటున్న సచివాలయాన్ని గ్రామ సర్పంచ్ గెడ్డం సుధ, ఎంపిడిఒ బికె ఎస్ఎస్.వెంకటరామన్ సచివాలయాన్ని ప్రారంభించడంతో సచివాలచ సిబ్బంది విధులు నూతనంగా నిర్మించిన సచివాలయంలో నిర్వహించారు



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపిడిఒ

నేడు యు.కొత్తపల్లి మండల సమావేశం

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

యు కొత్తపల్లి మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్టు ఎంపిడిఒ రవికుమార్ తెలిపారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు సర్పంచులు, ఎంపిటిసిలు తప్పక హాజరు కావాలని ఆయన తెలిపారు. అధికారులు సమావేశానికి హాజరు కాకపోతే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

యానాం వార్తలు



న్యూఇయర్ కేకును కట్ చేస్తున్న ఎంఎల్‌ఎ గొల్లపల్లి

ఎంఎల్‌ఎ గొల్లపల్లికి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - యానాం

నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం యానాం ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌కు అధికారులు, ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. యానాంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు బెజవాడ గార్డెన్స్‌లోని ఎంఎల్‌ఎ గొల్లపల్లి కార్యాలయానికి తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎను శాలువాలతో ఘనంగా సత్కరించారు. పోలీసు సిబ్బంది, యానాంలోని ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు ఎంఎల్‌ఎ గొల్లపల్లిని శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.



మల్లాడికి గజమాలతో శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు

మల్లాడి ఇంటి వద్ద న్యూ ఇయర్ వేడుకలు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు స్వగహం వద్ద అభిమానులు నూతన సంవత్సర వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి మల్లాడి కృష్ణారావుకు శుభాకాంక్షలు తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, వ్యాపారస్తులు మల్లాడి కృష్ణారావును సాలువాలతో ఘనంగా సత్కరించారు. అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేకులను మల్లాడి కష్ణారావు కట్ చేసి ప్రతి ఒక్కరికి పంచారు. అనంతరం అభిమానులు భారీ గజమాలతో మల్లాడిని సత్కరించారు. ఈ సందర్భంగా మల్లాడి స్వగహం పూర్తిగా జనసంద్రంగా మారింది.



చడ్డీలాల్‌కు నివాళులర్పిస్తున్న బలరామ్ తదితరులు

దళితుల అభ్యున్నతికి చడ్డీలాల్ కృషి

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గ దళితుల అభ్యున్నతికి దివంగత లెఫ్టినెంట్ గవర్నర్ చడ్డీలాల్ విశేష కృషి చేశారని రిటైర్డ్ ఆర్ఎఒ గిడ్డి బలరామ్ అన్నారు. బుధవారం చడ్డీలాల్ జయంతిని పురస్కరించుకుని స్థానిక అంబేద్కర్ నగర్‌లో దీనపోషక సమాజంలో చడ్డీలాల్ విగ్రహానికి పలువురు దళితనేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ చడ్డీలాల్ హయాంలో యానాంలో చదువుకున్న నిరుపేదలైన ఎస్‌సి యువతకు రిజర్వేషన్ పాలసీని పూర్తిస్థాయిలో అమలు చేశారన్నారు. వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీచేశారన్నారు. గృహనిర్మాణం, భూమిలేని నిరుపేదలకు బంజరు భూములకు పట్టాల పంపిణీ, వ్యవసాయ, పారిశ్రామిక రంగాభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పండు సిద్ధార్థకుమార్, నక్కా వాసుదేవరావు, బోడపాటి సురేష్, పువ్వల రాజారామ్మోహన్ రావు, సబ్బతి శ్రీనివాస్, మెల్లం చిన్న, వివిధ గ్రామాల దళితపెద్దలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న మృతుని తల్లిదండ్రులు

విద్యార్థి మృతిపై తల్లిదండ్రుల ఆందోళన

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక ఆదిత్య జూనియర్ కాలేజీలో ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థి గుత్తుల సతీష్ కుమార్ కాకినాడ బీచ్‌లో మృతి చెందడంతో తమకు సమాచారం ఇవ్వకుండా కాలేజీ యాజమాన్యం గోప్యంగా ఉంచి నిర్లక్ష్యం చేసిందన్న ఆగ్రహంతో విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు కాలేజ్ వద్ద ఆందోళన చేపట్టారు. దీనికి సంబంధించిన వివరాల ప్రకారం ఇంటర్ చదువుతున్న గుత్తుల సతీష్ కుమార్ నూతన సంవత్సరం సందర్భంగా తోటి విద్యార్థులతో కలిసి బయటకు వెళ్లారు. మొదటిగా కోరంగి వెళ్లి అక్కడ భోజనం చేసిన తరువాత సూర్యారావుపేట బీచ్‌కి వెళ్లి ప్రమాదవశాత్తు సముద్రంలో మునిగి మరణించారు. విద్యార్థులు ఆదిత్య యాజమాన్యానికి సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే స్పందించి మృతదేహాన్ని కాకినాడ మార్చురీకి తరలించారు. విద్యార్థి తల్లిదండ్రులు తమకు సమాచారం ఇవ్వకుండా మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించడం ఏమిటని ప్రశ్నిస్తూ కాలేజీ వద్ద ధర్నా నిర్వహించారు.